నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 5 మార్చి 2024 | SURYAPET



సూర్యాపేటలోని గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు

# మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

- మినీ డీఎస్సీతో చేతులు దులుపుకొంటే ఊరుకోం.. మెగా డీఎస్సీ వేయాల్సిందే..
- రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం
- సూర్యాపేటలోని గ్రంథాలయం ఎదుట డీఎస్సీ అభ్యర్థుల నిరసన

బొడ్రాయిబజార్, మార్చి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. డీఎస్సీ మెగా డీఎస్సీ కాదని.. దగా డీఎస్సీ అని, ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం 20 వేల పోస్టులకు తగ్గకుండా మెగా డీఎస్సీ వేయాలని, లేకుంటే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు హెచ్చరించారు. ప్రభుత్వం వేసిన మినీ డీఎస్సీని వ్యతిరేకిస్తూ సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో మొత్తం 11,062 పోస్టులు ప్రకటించిందని, ఇందులో అధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఉన్నాయని, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేవలం 2,629 మాత్రమే ఉండడం బాధ కలిగిస్తుందన్నారు. స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు సెకండరీ గ్రేడ్ పోస్టులకు అర్హత లేకపోవడం దారుణమన్నారు. గత నోటిఫికేషన్‌కు ప్రస్తుత నోటిపికేషన్‌కు ఎలాంటి పోస్టులు పెరుగలేదన్నారు. మార్చిలో పదవీ విరమణ చేస్తే ఖాళీ అయ్యేవాటిని కలిపి 24వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఖాళీలను గుర్తించి టెట్ నిర్వహించాలని, ఆ తరువాత 20 వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు తగ్గకుండా మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై హైదరాబాద్‌లో జరుగుతున్న డీఎస్సీ ధర్నాకు తాము సంపూర్ణ మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నిరుద్యోగులు శ్రీనివాస్, వెంకన్న, మహేశ్, సైదులు, శ్రవణ్, రమాదేవి, శ్రీదేవి, మాలతి, జానయ్య, హారిక, రాధిక, కవిత, లింగయ్య, నజీర్ పాల్గొన్నారు.

# శంభులింగేశ్వర స్వామి జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ లత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

సూర్యాపేట, మార్చి 7 : శివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 8న మేళ్లచెర్వులో నిర్వహించే శంభులింగేశ్వరస్వామి జాతరకు ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేళ్లచెర్వు జాతరకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా నిర్దేశించిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. వాహనాల పార్కింగ్, ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో లైటింగ్ ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని రూట్లలో బస్సులు నడుపాలన్నారు. శానిటేషన్, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. నిరంతరం విద్యుత్ ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అధికారులు రూపేందర్‌సింగ్, పద్మారావు, ప్రియదర్శిని, అలీ, సురేందర్, జ్యోతి పాల్గొన్నారు.

# సగం మందికే ఉచిత కరెంట్

## సూర్యాపేట జిల్లాలో గృహజ్యోతికి 1,47,325 దరఖాస్తులు

## ప్రభుత్వం మంజూరు చేసింది 68,300 కనెక్షన్లకే..

- వివిధ కారణాలతో వర్తించని పథకం
- సమస్య పరిష్కారానికి
- ప్రజాపాలన కేంద్రాలు

*ప్రభుత్వం తీసుకొచ్చిన గృహలక్ష్మి పథకం అర్హులందరికీ అందడంలేదు. జిల్లాలో సగం ఇండ్లకే ఉచిత కరెంట్ మంజూరైంది. వీరంతా డబ్బు లు చెల్లించాల్సిందేనని విద్యుత్ శాఖ బిల్లులు జారీ చేస్తున్నది. సూర్యాపేట జిల్లాలో గృహ జ్యోతి పథకం కోసం ప్రజా పాలనలో 1,47,325 దరఖాస్తులు రాగా, ప్రభుత్వం మాత్రం 68,300 కనెక్షన్లకే మంజూరు ఇచ్చింది. వివిధ కారణాలతో ఫ్రీ కరెంట్ వర్తించ లేదు. ఇదిలా ఉండగా అర్హుల సమస్య పరిష్కారానికి సర్కారు ప్రజా పాలన కేంద్రాలను తీసుకొచ్చింది.*

– సూర్యాపేట/యాదాద్రి భువనగిరి, మార్చి 4 (నమస్తే తెలంగాణ)

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఈ మేరకు అధికారంలోకి వచ్చాక ఆయా పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. ఇందుకోసం డిసెంబర్ 28వ తేదీన ప్రజా పాలన కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. జనవరి ఆరో తేదీ వరకు దరఖాస్తులను తీసుకుంది. అదే నెల 17 వరకు వాటిని ఆన్‌లైన్ చేశారు.









### 68,300 కనెక్షన్లకే ఫ్రీ కరెంట్..

ఆరు గ్యారెంటీల్లో గృహ జ్యోతి పథకం ఒకటి. 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంట్‌ను వాడుకోవచ్చు. 200 యూనిట్ల కంటే ఒక్క యూనిట్ అదనంగా వాడినా మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో ఫ్రీ కరెంట్ కోసం 1,47,325 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసింది. కానీ ప్రభుత్వం మాత్రం 68,300 కనెక్షన్లకే మంజూరు ఇచ్చింది. అంటే 79,025 మందిని అనర్హులుగా తేల్చింది.

### యాదాద్రి జిల్లాలో 1,18,350 కనెక్షన్లకు..

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఫ్రీ కరెంట్ కోసం 2,09,131మంది దరఖాస్తులు చేసుకున్నారు. కానీ 1,18,350 కనెక్షన్లకే మంజూరు చేశారు. అంటే 90,781మందిని అనర్హులుగా తేల్చారు.. జిల్లాలో ఇప్పటి వరకు 40వేల వరకు విద్యుత్ బిల్లులు జనరేట్ చేశారు. ఇందులో 93శాతం జీరో బిల్లులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. కాగా జిల్లాలో 2.16లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉండటం గమనార్హం.

### వివిధ కారణాలు..

ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ వివిధ కారణాలతో మంజూరు చేయలేదని తెలిసింది. కొందరికి తెల్ల రేషన్ కార్డులు లేపోవడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఇక ఆధార్ కార్డు నంబర్లు సరిగా ఎంటర్ చేయకపోవడం, కస్టమర్ ఐడీ సరిగా ఇవ్వకపోడం లాంటి తదితర కారణాలతో మంజూరు కాకపోవచ్చని అధికారులు చెబుతున్నారు. కొంత మందికి 200యూనిట్లు కంటే ఎక్కువ కరెంట్ వాడి ఉండవచ్చని పేర్కొంటున్నారు.

### ప్రజాపాలన కేంద్రాల ఏర్పాటు..

గృహ జ్యోతి పథకం అమలు మొదటి నెల కావడంతో కొన్ని చోట్ల లోపాలు ఉండవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. పెద్ద మొత్తంలో అనర్హులుగా తేలడంతో సమస్యల పరిష్కారానికి చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం జిల్లాలో ప్రజా పాలన కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ పూర్తి చేసింది. సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. భువనగిరి, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లో రెండేసి చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేయగా, మండలానికో సేవా కేంద్రం పెట్టారు. జీరో బిల్లులు రాని వారు సేవా కేంద్రాల్లో సమస్యను పరిష్కరించుకోవచ్చు. ఏమైనా పొరపాటు ఉంటే వెంటనే ఆపరేటర్ ఎడిట్ ఆప్షన్‌లో క్లియర్ చేయనున్నారు.

### జీరో బిల్లు కోసం ప్రజల ఇక్కట్లు



శాలిగౌరారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కరెంట్ బిల్లులు చూపిస్తున్న ప్రజలు

శాలిగౌరారం, మార్చి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అర్హులైన గృహ విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పింది. ఆ మేరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి ఆరు గ్యారెంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఈ మేరకు ఈ నెల నుంచి తెల్లరేషన్ కార్డు ఉన్న ఇంటికి జీరో కరెంట్ బిల్లును అందజేస్తున్నది. ఈ నెల 2 నుంచి 200 యూనిట్ల లోపు వాడిన వారికి జీరో బిల్లులు వస్తుండగా చాలా మంది అర్హులకు రాకపోవడంతో అవాక్కయ్యారు. ఈ విషయమై విద్యుత్ సిబ్బందిని అడగగా తెల్ల రేషన్ కార్డు ఉండి జీరో బిల్లు రానివారందరూ ఎంపీడీఓ కార్యాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో వారు అక్కడికి బారులుదీరుతున్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో జనం రావడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు.



ఎఫ్‌పీఓలో నిమ్మ గ్రేడింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం సభ్యులు

# సన్న, చిన్నకారు రైతులకు కట్టంగూర్ ఎఫ్‌పీఓ ఆదర్శం

- మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం

కట్టంగూర్, ఫిబ్రవరి 10 : కట్టంగూర్ ఎఫ్‌పీఓ ప్రపంచంలోని చిన్న, సన్నకారు రైతులకు ఆదర్శమని మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ విభాగం డైరెక్టర్ క్వింటన్ ఆర్ టైలర్ అన్నారు. సోమవారం మండలంలోని అయిటిపాముల జీపీ పరిధిలో గల గంగాదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ విభాగానికి చెందిన ఆమెరికా శాస్త్రవేత్తల బృందం సభ్యులు సందర్శించారు. సంఘం నిర్వాహకులు నిమ్మ స్టోరేజీ యూనిట్, ప్రాసెసింగ్ యూనిట్, సోలార్ డయ్యర్స్ గురించి వారికి వివరించారు. సన్న, చిన్న కారు రైతులు సమస్యలను పరిష్కరించుకునేదుకు సంఘటితంగా ఎఫ్‌పీఓను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు ఖరీం మరిడియా, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి సంగీత లక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, ఏడీఏ హుస్సేన్‌బాబు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఉద్యానవన అధికారి రావుల విద్యాసాగర్, ఏఓ శ్రీనివాస్, ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# యాదగిరి గుట్ట బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి వస్త్రాలు

- సిద్ధం చేస్తున్న చేనేత కళాకారులు



లక్ష్మి అమ్మవారి కోసం చీరె నేస్తున్న కార్మికుడు

భూదాన్ పోచంపల్లి, మార్చి 4 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు భూదాన్ పోచంపల్లి నుంచి వస్త్రాలను అందించనున్నారు. స్థానిక పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీదేవి అమ్మవారికి రెండు ఇక్కత్ పట్టు చీరెలు, స్వామివారికి పట్టు దోవతులు, శాలువాలు సమర్పించేందుకు సంబంధిత వస్త్రాలను పద్మశాలి మహాజన సంఘ భవనంలో మగ్గం ఏర్పాటు చేసి తయారు చేస్తున్నారు. మగ్గంపై ఫిబ్రవరి 29 నుంచి నేతను ప్రారంభించి పట్టు దోవతులు, శాలువాలు తయారు చేశారు. లక్ష్మీదేవి అమ్మవారి కోసం ఆఫ్ వైట్, మెరూన్ అంచు ఒక చీర, చిలకపచ్చ మెరూన్ అంచుతో ఫుల్ డిజైన్ ఇక్కత్ పట్టు చీరెలను నిమయనిష్టలతో చేనేత కళాకారులు మేకల రామకృష్ణ, పురుషోత్తం తయారు చేస్తున్నారు. ఈ నెల 9న పట్టు చీరెల తయారీ పూర్తికానున్నది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల కోసం ప్రతి సంవత్సరం మాదిరిగానే భూదాన్‌పోచంపల్లి మార్కండేశ్వర స్వామి దేవాలయం నుంచి ముత్యాల తలంబ్రాలు సమర్పణ చేయనున్నారు.

ఈ నెల 11న యాదగిరి గుట్ట బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను అందజేసేందుకు పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఉపాధ్యక్షులు బోగ నరసింహ, అంకం మురళి, ప్రధాన కార్యదర్శి భారత బాలరత్నం, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.



రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేసిన చలువ పందిళ్లు

# గుట్టలో నేటి నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

- 7న కల్యాణం, 9న రథోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 10 వరకు జరుగనున్న వేడుకలకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అరటి, మామిడి తోరణాలు, చలువ పందిళ్లతోపాటు యాగశాల సిద్ధం చేశారు.

### స్వస్తివాచనంతో ఉత్సవాలకు శ్రీకారం

రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్వస్తివాచనంతో ఉత్సవాలకు ప్రధానార్చకులు, పురోహితులు శ్రీకారం చుట్టనున్నారు. 6వ తేదీ ఉదయం ధ్వజారోహణం, భేరీపూజ, దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ నిర్వహించనున్నారు. 7న రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, 8న మహాశివరాత్రి సందర్భంగా అభిషేకం, రాత్రి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, 9న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లక్ష బిల్వార్చన, రాత్రి స్వామివారి రథోత్సవం జరిపించనున్నారు. 10న మధ్యాహ్నం పూర్ణాహుతి, రాత్రి డోలోత్సవంతో ఉత్సవాలను పరిపూర్ణం చేయనున్నారు.

### పూజల్లో పాల్గొనే భక్తులకు టికెట్లు

మహా శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు వసతి కల్పించనున్నారు. వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు టికెట్లను నిర్ణయించారు. 7న కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ. 516(ఇద్దరికి), మహాశివరాత్రి రోజున జరిగే అభిషేకానికి రూ 300, రాత్రి జరిగే శతరుద్రాభిషేకానికి రూ. 516(ఇద్దరికి), 9న జరిగే లక్ష బిల్వార్చనలో పాల్గొనే భక్తులు రూ. 516(ఇద్దరికి) చెల్లించాల్సి ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.

# పీఎం విశ్వకర్మకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చూడాలి

- కలెక్టర్ హరిచందన



ప్రజావాణిలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నల్లగొండ, మార్చి 4 : ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద ఎక్కువ మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా మత్స్యశాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు తదితర శాఖల ద్వారా చేతివృత్తుల వారికి ఇచ్చే యూనిట్లకు సంబంధించి వారికి అవగాహన కల్పించి మరింత ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చూడాలని అన్నారు. ముఖ్యంగా ఆయా శాఖల అధికారులు ఈ విషయంలో సంబంధిత చేతి వృత్తుల వారికి విస్తృతంగా తెలియ చెప్పాలని కోరారు.

### ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ దాసరి హరిచందనఅ ధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆమె ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆమె జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని సూచించారు. దానివల్ల దరఖాస్తుదారులకు మేలు కలుగుతుందని అన్నారు. జిల్లా స్థాయితో పాటు, కిందిస్థాయి అధికారులు సైతం ఫిర్యాదుల పరిష్కారంలో చొరవ చూపాలని తెలిపారు.

### నిరక్ష్యరాస్యులకు విద్యను అందించాలి

తెలంగాణలో న్యూ ఇండియా లిట్రసీ ప్రోగ్రాం కింద నిరక్షరాస్యులైన వయోజనలను గుర్తించి వారికి విద్యను అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ దాసరి హరిచందన సూచించారు. తెలంగాణలో న్యూ ఇండియా లిట్రసీపై కలెక్టరేట్‌లో ఆమె అధికారులతో సమావేశమయ్యారు. మొదటి సంవత్సరం జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆయా శాఖల ద్వారా చదువురాని 18 నుంచి 35 యేండ్ల మధ్య వయసు ఉన్న వారిని గుర్తించి వారికి ఆన్‌లైన్ లేదా మొబైల్ ద్వారా విద్యను అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్వో రాజ్యలక్ష్మి, ప్రత్యేక కలెక్టర్ నటరాజ్, డీఈఓ భిక్షపతి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



కేశరాజు పల్లిలో ఎండిన పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

# ఎండుతున్న పొలాలను మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- అధికారులు కరువు నష్ట పరిహారం అంచనా వేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- కేశరాజుపల్లిలో ఎండిన పంట పొలాల పరిశీలన.. కలెక్టర్‌కు వినతిపత్రం

నల్లగొండ, మార్చి 4 : భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయక ఎండుతున్న పంటలను మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అధికారులు కరువుపై పంట నష్టపరిహారం అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి కోరారు. నల్లగొండ పట్టణ సమీపంలోని కేశరాజు పల్లిలో నీరు లేక ఎండుతున్న వరి పొలాలకు ట్యాంకర్ ద్వారా రైతులు నీళ్లు పెడుతున్న విషయం నమస్తే తెలంగాణలో ప్రచురితం కాగా వారు అక్కడికి వెళ్లి పొలాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ దాసరి హరిచందనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ నీళ్లు లేకపోవడంతో ఒక్కో రైతు ఎకరానికి పెట్టిన 25 వేల రూపాయలు కోల్పోయినట్లేనన్నారు. వేసిన పంటలు ఎండిపోయి పశువులు మేపుకొనే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు నింపితే కొంతమేర పంటలను కాపాడుకోవచ్చున్నారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా చెరువులను నింపితే నల్లగొండ, దేవరకొండ, నకిరేకల్ ప్రాంతాల్లో పంటలు దక్కుతాయని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నీటి విడుదలకు ముందుకు రావడం లేదని ఆరోపించారు. 40 నుంచి 50 శాతం పంటలు చేతికి వచ్చే సమయంలో ఎండిపోతున్నందున రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండీ సలీం, జిల్లా కమిటీ సభ్యులు వీరపల్లి వెంకటేశ్వర్లు, పాలడుగు నాగార్జున, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, పట్టణ నాయకులు కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నరసింహ, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, భూతం అరుణ, కేశరాజుపల్లి మాజీ సర్పంచ్ పొనుగోటి జనార్దన్‌రావు, రైతులు ముత్తినేని పరశురామ్, ముత్తినేని మురళి, చింతల దుర్గయ్య, నర్సిరెడ్డి, చింతల రామస్వామి, చింతల మధు, వెంకన్న పుల్లయ్య పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లాలో ఏడుగురు సీఐల బదిలీ

నీలగిరి, మార్చి 4 : పార్లమెట్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న ఏడుగురు సీఐలను బదిలీ చేస్తూ ఎస్పీ చందనా దీప్తి ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరినీ జోనల్ 2కు బదిలీ చేయగా అక్కడ పని చేస్తున్న అధికారులను ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేశారు. నల్లగొండ టూ టౌన్ కొండల్ రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ చీర్ల శ్రీనివాస్, మిర్యాలగూడ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, నాంపల్లి సీఐ జలంధర్, డీఎస్‌బీ సీఐ సూర్యానాయక్, రౌతు గోపిలను సైబరాబాద్‌కు, నల్లగొండ ట్రాఫిక్ సీఐగా ఉన్న డానియల్ కుమార్‌ను నల్లగొండ టూటౌన్‌కు బదిలీ చేశారు. మల్టీజోన్–2లో ఉన్న ఎన్. శంకర్‌ను డీఎస్‌బీకి, బోజ్యా అంగోత్‌ను డీసీఆర్‌బీకి, ఆనంద్‌కుమార్‌ను నల్లగొండ ట్రాఫిక్‌కు, కె.వినోద్ కుమార్‌ను డీటీసీకి, జి.సుధాకర్‌ను మిర్యాలగూడ వన్ టౌన్‌కు, సూర్యాపేటలో ఉన్న కె.శివశంకర్‌ను పీసీఆర్‌కు బదిలీ చేశారు.



నల్లగొండలో లక్కీ డ్రా నిర్వహిస్తున్న ఆర్ఎం శ్రీదేవి

# ఆర్టీసీ లక్కీడ్రాలో విజేతల ఎంపిక

నల్లగొండ సిటీ, మార్చి 4 : గత సంవత్సరం దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల కోసం టీఎస్ఆర్టీసీ లక్కీ డ్రాను ఆఫర్ ప్రవేశపెట్టింది. దానికి సంబంధించి సోమవారం నల్లగొండ బస్‌స్టాండ్ అవరణలో ఆర్ఎం శ్రీదేవి ప్రయాణికుల ఆధ్వర్యంలో డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. గత సంవత్సరం ఆర్టీసీ ప్రయాణికులను ఆకర్షించేందుకు అక్టోబర్ 18 నుంచి 30 వరకు బస్సుల్లో ప్రయాణించిన వారి టికెట్‌ను మొబైల్ నంబర్ రాయించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాలో స్వీకరించారు. రీజియన్ పరిధిలో మొత్తం పది మందిని డ్రా ద్వారా ఎంపిక చేయగా అందులో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున నగదు అందజేయనున్నట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ మాధవి,డిప్యూటీ ఆర్ఎం శివశంకర్, డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్, నరేందర్, శ్యామలదేవి, పాండయ్య పాల్గొన్నారు.